RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :179 EDITOR: CHERUKU UPENDAR, DATE : TUESDAY 14 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 179 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 14 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

### సైనికులతో దీపావళి వేడుకలు
## జరుపుకున్న ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ-జయనేత్ర :** ప్రధాని మోడీ ఆదివారం హిమాచల్ ప్రదేశ్‌లోని లెప్చాకు చేరుకున్నారు. సైనికులతో కలిసి దీపావళిని జరుపుకున్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రధాని మోడీ ప్రతి ఏడాది దీపావళి రోజున సైనిక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. "మన ధైర్యవంతులైన భద్రతా దళాలతో దీపావళి జరుపుకునేందేందుకు హిమాచల్ ప్రదేశ్‌లోని లెప్చా చేరుకున్నాను "అని ఎక్స్ (ట్విటర్)లో పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన ఫోటోలను పంచుకున్నారు. ప్రజలకు కూడా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈసారి గెలిచేది చెయ్యి గుర్తేనంటగా..!

- కరోనా వైరస్ లా వ్యాపిస్తున్న మౌత్ టాక్
- పాత చింతకాయ పచ్చడిలాగ దొరగారి బహిరంగ సభల స్పీచ్ లు
- అరిగిపోయిన గ్రాంఫోన్ రికార్డుల్లా యువరాజు కేటీఆర్ ముచ్చట్లు
- బిఆర్ఎస్ కు ఓటేస్తే తుస్సుమన్నట్లెనంటగా..!
- జనాలను ఆకట్టుకోవడంలో వెనుకబడ్డ కెసిఆర్ ప్రసంగాలు
- రేవంత్ స్పీచ్ లకు పబ్లిక్ ఫుల్ అట్రాక్ట్
- ఏ నోటా విన్నా, ఏ నలుగురు కలిసిన, ఇద్దరు దోస్తులు మాట్లాడుకున్న ఇదే మాట



పొలిటికల్ బ్యూరో - ప్రభాత సూర్యుడు

'ఈ సారి గెలిచేది చెయ్యి గుర్తు కాంగ్రెస్ పార్టీనేనంటగా..!, 'ఎహె.. అప్పట్లో కెసిఆర్ మాట్లాడితే మస్తు ఉండేది', ఇప్పుడు పాత చింతకాయ పచ్చడిలాగా 'అయ్య' ముచ్చట, అరిగిపోయిన టేపు రికార్డులాగా కొడుకు ముచ్చట ఉంది, పసలేదు. అరె.. ఏం మాట్లాడుతున్నాడు రాబై రేవంత్ రెడ్డి.., నిజంగానే పాట్టోడు గట్టోడురా !. ఈ మాటలన్నీ ఎవరో అంటున్నవో కాదు. పొలం గట్టుమీద, ఊరి నడిబొడ్డున ఏ నలుగురు కూడినా, ఇద్దరు దోస్తులు మాట్లాడుకున్న, ఎక్కడ చూసినా ఇదే చర్చ. మొత్తానికి ఏ నోట విన్న ఇదే మాట.

పండగలకు పట్నం నుండి సొంత ఊర్లకు వెళ్తే.,ఎట్లున్నది రా రాజకీయం, ఏది గెలుస్తదంట ? కాంగ్రెస్సే గెలుస్తుందంటగా..! 'ఈసారి వచ్చేది కాంగ్రెస్సే.."బీఆర్ఎస్ గెలుసుడు కష్టమే..'తెలంగాణ రాష్ట్రం పల్లెల్లో ఎక్కడికి వెళ్లిన ఇవే మాటలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఏ సెంటర్లో నలుగురి నోట ఇవే ముచ్చట్లు, పొలాల పొంటి అక్కల నోట ఇదే మాట, ఇద్దరు మిత్రులు కలుసుకున్నా, ఫోన్లో మాట్లాడుకున్నా.. కాంగ్రెస్ ఫుల్ జోష్ లో ఉందిరా..ఈ సారి పక్క గెలిసేది కాంగ్రెస్సే.., బిఆర్ఎస్ కు ఓటేస్తే కాలిపోయి తుస్సు మంటదందట. ఈ మాటలన్నీ దావానంలంగా తెలంగాణా మొత్తం కరోనా కంటే స్పీడుగా ప్రతినోట పాకిపోతుంది. ఆ దిశగా కాంగ్రెస్ పార్టీ కూడా ప్రచారం చేసుకుంటోంది. కానీ అంతకంటే డబుల్ స్పీడుతో జనాల మౌత్ టాక్ విస్తరిస్తోంది. అసలు విషయం చెప్పాలంటే ఈ అంశంపైనే అధికార బిఆర్ఎస్ పార్టీకి గుబులు పట్టుకుంది. దీని ఎఫెక్ట్ వృద్ధ పెన్షన్ దారులపై, మహిళపై పడితే పరిస్థితి ఏమిటని అధికార పార్టీ వర్గాలు భావిస్తున్నారు. ఇది ఇలానే కొనసాగితే భారీ నష్టం తప్పదని పెద్ద బాస్ కలవర పడుతున్నారు. ఇంకా ఎన్నికలకు 18 రోజుల గడువుంది. ఈలోగా పరిస్థితులను చక్కదిద్దుకోవాలనే అంతర్మథనంలో పడ్డారు. దీన్ని




ఎదుర్కొనేలా గ్రామాల్లోని వృద్ధులను, మహిళలను, కుల,మహిళా సంఘాలతో మీటింగులు ఏర్పాటు చేసి కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారాలకు తెరలేపుతున్నారు. పిన్షన్ ఆపేస్తారు, కరెంటు, రైతుబంధు, దళితబందు ఇవ్వరు, ధరణి తీసేస్తారు.., ఇలా మెదడుకు పదును పెడుతున్నారు. మొత్తానికి మళ్ళీ ఒక్కసారి ఏదేమైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న గమ్యంతో బిఆర్ఎస్ వర్గాలు గులాబీ బాస్ కెసిఆర్ దిశానిర్దేశంతో పనిచేసున్నాయి.


## 17న తెలంగాణకు రాహుల్



**హైదరాబాద్ విజయనేత్ర:** కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరు రోజులపాటు తెలంగాణలో పర్యటించ నున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగానే ఆయన టూర్ ఖరారైనట్లు తెలుస్తోంది. ఆ నెత 17వ తేదీన తెలంగాణకు రానున్న రాహుల్.. 23 దాకా ఇక్కడే ఉండనున్నట్లు సమాచారం. అదే తేదీలో పాలకుర్తి, వరంగల్, భువనగిరిలో కాంగ్రెస్ నిర్వహించే సభల్లో పాల్గంటారు. అక్కడి నుంచి వరుసగా ఆరు రోజుల పాటు ఆయన వరుసగా సభల్లో పాల్గననున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రతీ నియోజకవర్గంలోనూ పార్టీకి చెందిన అగ్రనేతల పర్యటనలు ఉండేలా కాంగ్రెస్ కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలోనే ఒకేరోజు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సమావేశాలు ఉండేలా ప్లాన్ చేస్తోంది.

# ఆర్థిక నేరస్థులకు సంకెళ్లు వేయొద్దు

**న్యూఢిల్లీ:** ఆర్థిక నేరాలకు పాల్పడి కస్టడీకి తీసుకున్న వారి చేతికి సంకెళ్లు వేయొద్దని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. బీజేపీ ఎంపీ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని హౌం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కొత్త క్రిమినల్ చట్టాలకు మార్పులను సూచించింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) ప్రకారం ఒక ఆర్థిక నేరగాడిని అరెస్టు చేసిన మొదటి 15 రోజులకు మించి పోలీసు కస్టడీలో ఉంచినప్పుడు సంబంధించిన మార్పులను సూచించింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్పీసీ) బ్రిటిష్ కాలంనాటిదని, దానిని అనుసరించే అవసరంలేదని పేర్కొంది. మూడు ప్రతిపాదిత చట్టాలు క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్ (సీఆర్పీసీ)-1898, ఇండియన్ పీనల్ కోడ్(ఐపీఎస్)-1860, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్(ఐఈఏ)-1872ల స్థానంలో తెచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్-2023), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ-2023) బిల్లులతో పాటు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్-2023) బిల్లును ఆగస్టు 11న కేంద్ర హౌం శాఖ మంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు.




బీఎన్ఎస్ఎస్ క్లాజ్ 43(3)లో పేర్కొన్న విధంగా, తీవ్రమైన నేరాలకు పాల్పడిన వ్యక్తులు తప్పించుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది విధించే శిక్షలకు పరిమితి విధించింది. అయితే 'ఆర్థిక నేరాలను' ఈ కేటగిరీలో చేర్చకూడదని కమిటీ అభిప్రాయపడింది. ఎందుకంటే ఆర్థికనేరాల్లో అనేక రకాలుంటాయి. చిన్న నుంచి పెద్ద స్థాయి వరకు అన్ని నేరాలకు చేతికి సంకెళ్లు వేయడం సరికాదని కమిటీ అభిప్రాయపడింది. 'ఆర్థిక నేరాలు' అనే పదాన్ని తొలగించడానికి క్లాజ్ 43(3)ని సవరించవచ్చని ప్యానెల్ సూచించింది. ఆ క్లాజ్ ప్రకారం.. పోలీసు అధికారి నేర స్థాయినిబట్టి కస్టడీ నుంచి మాటిమాటికి తప్పించుకుంటున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసే సమయంలో చేతికి సంకెళ్ళు ఉపయోగిం చవచ్చు అని పేర్కొంది. వ్యవస్థీకృత నేరం, ఉగ్రవాద చర్య, మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరం లేదా అక్రమంగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని కలిగి ఉండటం, హత్య, లైంగికదాడి, యాసిడ్ దాడి, నకిలీ నాణాలు, ఫేక్ కరెన్సీ నోట్లతో పట్టుబడటం, మానవ అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక నేరాలు ఇలాంటివాటికి పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

ఈ క్లాజ్ వివరణలో మరింత స్పష్టత ఇవ్వడానికి తగిన సవరణను తీసుకురావాలని కమిటీ సిఫార్సు చేసింది. బీఎన్ఎస్ఎస్ క్లాజ్ 482లో, 'నిందితుడు మొదటి 15 రోజులకు మించి పోలీసు కస్టడీకి అవసరం కావచ్చు' అనే పదాలను కూడా కమిషన్ జోడించింది. ప్రస్తుత కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్పీసీ) ప్రకారం, విచారణ సందర్భంగా నిందితుడిని గరిష్టంగా 15 రోజుల వరకు మాత్రమే పోలీసు కస్టడీ కోరవచ్చు. పార్లమెంటరీ ప్యానెల్ నివేదికలను శుక్రవారం రాజ్యసభకు సమర్పించింది.

## ఉపసంహరణకు రేపటి వరకు గడువు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా ఇప్పటికే నామినేషన్ల దాఖలు ముగిసిన విషయం తెలిసిందే. సోమవారం స్థానికంగా ఎక్కడిక్కడ రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల పరిశీలనను పూర్తిచేశారు. కొందరు అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో ఖాళీలు వదలడంతో వారికి సమాచారం ఇచ్చి, వాటిని భర్తీ చేయాలని కోరారు. మొత్తం 119 నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. దీనితో బుధవారం మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. దీనితో రాజకీయపార్టీల్లో బుజ్జగింపుల పర్వం ప్రారంభమైంది. ఆయా పార్టీల్లో రెబల్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారిని ఉపసంహరించుకోవాలని ఆయా పార్టీల అధిష్టానాలు విజ్ఞప్తులు చేస్తున్నాయి. పార్టీల తరపున బీ ఫారమ్ తీసుకున్న అధికారిక అభ్యర్థులు కూడా తమ విజయానికి ఆటంకం కలుగుతుందని భావించే అభ్యర్థులను బుజ్జగించేపనిలో పడ్డారు. మరికొందరు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా ఓట్లను చీల్చే అవకాశం ఉండటంతో కుల సమీకరణాలు, ఇతరత్రా అంశాలపై దృష్టిపెట్టి, సాధ్యమైనంత తక్కువ మంది పోటీలో ఉండేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. మొత్తం 119 నియోజకవర్గాల్లో 4,798 నామినేషన్‌లు దాఖలైన విషయం తెలిసిందే. నామినేషన్ల ఉపసంహరణ తర్వాతే ఏ నియోజకవర్గంలో ఎంతమంది అభ్యర్థులు పోటీలో ఉంటారో స్పష్టంగా తేలనుంది. అలాగే ఈనెల 30న పోలింగ్, డిసెంబర్ 3వ తేదీ ఫలితాలు వెల్లడవుతాయి.

## రేవంత్ రెడ్డిపై, ఈసీకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రేవంత్ రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, అలాగే బీఆర్ఎస్ పార్టీని కించపరిచేలా కాంగ్రెస్ ప్రకటనలు ఇస్తోందని, వీటిని వెంటనే నిలిపివేసేలా చూడాలని బీఆర్ఎస్ లీగల్ టీమ్ సోమవారం సీఈవో వికాస్ రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ ప్రకటనలపై ఇదివరకే ఫిర్యాదు చేసిన అధికార పార్టీ తాజాగా మరోసారి చేసింది. ఈ మేరకు సీఈవోకు లీగల్ సెల్ కన్వీనర్ సోమా భరత్ వినతిపత్రం అందించారు. కార్యకర్తల్ని రెచ్చగొడుతూ దుర్భాషలాడుతున్న రేవంత్ రెడ్డిని ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా నిషేధం విధించాలని బీఆర్ఎస్ లీగల్ టీమ్ కోరింది. సోమా భరత్ మాట్లాడుతూ మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడిని ఖండించకుండా కామెడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్చంపేటలో గువ్వల బాలరాజుపై కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ దాడి చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎందుకు ఇలా జరుగుతుందో ప్రజలు ఆలోచించాలన్నారు. రేవంత్ రెడ్డిని ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా నిషేధించాలని ఈసీని కోరామన్నారు.

## ఢిల్లీలో ప్రమాదకరస్థాయిలో వాయుకాలుష్యం

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

ఇప్పటికే కాలుష్య కోరల్లో ఉన్న ఢిల్లీ దీపావళి బాణాసంచా కాల్పులతో మరింత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీపావళి సందర్భంగా ప్రజలు బాణాసంచా పేల్చడంతో కాలుష్యం, పొగ కమ్మేశాయి. ఢిల్లీతోపాటు రాజధాని ప్రాంతాల్లో (ఎన్‌సిఆర్) సోమవారం ఉదయం పెరిగిన కాలుష్యం ఆందోళన కలిగిస్తోంది. ఉదయం 6.00 గంటల సమయంలో ఢిల్లీ వాయు నాణ్యతా ప్రమాణం (ఎక్యూఐ) 500 కంటే అధికంగా ఉంది. కొన్ని ప్రదేశాల్లో 900 కి చేరుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎక్యూఐ 910, కరోల్‌బాగ్‌లో 779గా నమోదయ్యాయి. గతవారం కురిసిన వర్షాలు కాలుష్యం నుండి కొంతమేర ఉపశమనం కలిగించినప్పటికీ.. బాణాసంచాతో గాలి నాణ్యత మళ్లీ క్షీణించింది. ఊపిరితిత్తులను ప్రమాదానికి గురిచేసే అతి సూక్ష్మ దూళికణాలుగా పేర్కొనే పిఎం 2.5 కణాల సాంద్రత 24 గంటల్లోనే 140 శాతం పెరిగింది. ఆదివారం ఉదయానికి క్యూబిక్ మీటరుకు 83.5గా ఉండగా, ఈ ఉదయానికి అది 200.8కి చేరింది. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో వాయు కాలుష్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) నిర్దేశించిన పరిమితి కంటే 30 రెట్లు ఎక్కువ అని ఢిల్లీ కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది.

**అత్యంత కాలుష్య నగరాల్లో మరో రెండు నగరాలు**

ప్రపంచంలోనే 10 అత్యంత కాలుష్య నగరాల జాబితాను స్విస్ గ్రూప్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ తాజాగా విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ అగ్రస్థానంలో ఉండగా, దీపావళి కారణంగా పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా, మహారాష్ట్ర రాజధాని ముంబై నగరాలు కూడా తీవ్ర వాయుకాలుష్యంలో చిక్కుకున్నాయి. ఎక్యూఐ సూచిక 400 నుంచి 500 మధ్య నమోదైతే వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉన్నట్టు. ఈ స్థాయిలో ఉండే వాయు కాలుష్యం ఆరోగ్యవంతమైన వ్యక్తులపై కూడా ప్రభావం చూపుతుంది. ఎయిర్ క్వాలిటీ సూచిక 150 నుంచి 200 మధ్య నమోదైతే అస్తమా, ఊపిరితిత్తులు, గుండె సమస్యలతో బాధపడుతున్న వారు అస్వస్థతకు గురయ్యే అవకాశాలు ఎక్కువ.

## అశ్రునయనాల మధ్య ముగిసిన చంద్రమోహన్ అంత్యక్రియలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

సీనియర్ నటుడు చంద్రమోహన్ అంత్యక్రియలు ముగిశాయి. చంద్రమోహన్ తీవ్ర అనారోగ్యం కారణంగా నవంబరు 11న కన్నుమూశారు. అమెరికాలో ఉన్న పెద్ద కుమార్తె ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న నేపథ్యంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఉదయం హైదరాబాద్ ఫిలింనగర్ లోని ఆయన నివాసం నుంచి పంజాగుట్ట శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర జరిగింది. అశ్రునయనాల మధ్య ఆయన అంతిమ సంస్కారాలు ముగిశాయి. చంద్రమోహన్ సోదరుడు దుర్గాప్రసాద్ అంతిమ సంస్కారాలు జరిపారు. చంద్రమోహన్ భౌతికకాయానికి పలువురు సినీ ప్రముఖులు కడసారి నివాళులు అర్పించారు. చంద్రమోహన్ కు గతంలో బైపాస్ సర్జరీ జరిగింది. హృద్రోగంతో పాటు కిడ్నీ సంబంధ సమస్య కూడా తలెత్తడంతో ఆయన కోలుకోలేకపోయారు. శనివారం నాడు తన నివాసంలో సొమ్మసిల్లి పడిపోయిన ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు.

## హైదరాబాద్‌లో ఘోరం

# అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం

### తొమ్మిది మంది మృతి

**హైదరాబాద్ విజయనేత్ర:** నివాస సముదాయంలో అక్రమంగా నిల్వ చేసిన రసాయనాలు పేలి తొమ్మిది మంది మృతి చెందారు. వీరిలో ఆరుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రమాదంలో చిక్కుకున్న 21 మందిని అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, డిఆర్‌ఎఫ్ బృందాలు కాపాడాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోగల బజార్‌ఘాట్‌లోని వ్యాపారవేత్త రమేష్ జైశ్వాల్‌కు చెందిన బాలాజీ రెసిడెన్సీ నాలుగు అంతస్తుల భవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. సెల్లార్ నుంచి రగులుకున్న మంటలు అక్కడ అక్రమంగా ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెంజీన్ నైట్రేట్ ద్రావణానికి అంటుకోవడంతో నిమిషాల వ్యవధిలోనే నాలుగు ఫ్లోర్లకు వ్యాపించాయి. మండే గుణం కలిగిన రసాయనాలు కావడంతో మంటల తీవ్రతతోపాటు దట్టమైన పొగలు కమ్మేయడం, పేలుడు సంభవించడంతో అపార్ట్‌మెంట్లోని వారు భయంతో బయటకు పరుగులు తీశారు. అయితే, అప్పటికే మెట్ల మార్గంలో నల్లటి పొగలు కమ్మేయడంతో ఎటు వెళ్లాలో అర్థం కాక 'రక్షించండి. రక్షించడం' అంటూ పలువురు బిగ్గరగా కేకలు చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, జిహెచ్‌ఎంసికి చెందిన డిఆర్‌ఎఫ్ బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అతికష్టమ్మీద భవనం లోపలికి వెళ్లిన రెస్క్యూ టీం మొదటి, రెండు అంతస్తుల్లో అపస్మారక స్థితిలో ఉన్న తొమ్మిది మందిని నిచ్చెల సహాయంతో కిందకి తెచ్చి ఉస్మానియా ఆస్పత్రికి తరలించింది. అయితే, అప్పటికే



వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మంటల్లో చిక్కుకుని ప్రాణాలతో బైటపడిన 21 మందిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ప్రమాదంలో కొన్ని కార్లు, పలు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. మృతుల్లో ఎండి జకీర్ హుస్సేన్ (66), ఎండి అజాం (57), రెహ్మాన్ సుల్తానా (50), నికత్ సుల్తానా (50), తహూరా ఫర్హీమ్ (35), హజేబుర్ రెహ్మాన్ (32), ఫైజా సమీనా (26), తరోబా (13), మన్హా (6) ఉన్నారు. నికత్ సుల్తానా, ఫర్హీమ్, రెహ్మాన్ తప్ప మిగిలిన ఆరుగురూ ఒకే కుటుంబానికి చెందినవారు. ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, గవర్నర్ తమిళిసై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే ఘటనాస్థలికి వెళ్లాల్సిందిగా మంత్రులు కెటిఆర్, తలసానిలను సిఎం ఆదేశించారు. ప్రమాద ఘటనపై పూర్తి వివరాలతో నివేదిక అందజేయాల్సిందిగా పోలీసులకు గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు కెటిఆర్, తలసాని, మేయర్ విజయలక్ష్మి, స్థానిక నాయకులు ఫిరోజ్ ఖాన్, నంద కిషోర్ వ్యాస్, కుమార్ గౌడ్, విహెచ్ సందర్శించారు. కాల్చిన పటాసుల నిప్పు రవ్వలు సెల్లార్‌లో పడి రసాయనాలకు అంటుకుని మంటలు వ్యాపించి ఉంటాయని క్లూస్ టీం ప్రాథమికంగా నిర్ధారించినట్టు పోలీసులు తెలిపారు. నాంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ వస్తే అధోగతి..!

### - ఆరునూరైనా గెలుపు తధ్యం - ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

నర్సంపేట- ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వస్తే ఆగమాగమేనని, అందుకే ఓటు అలవోకగా వేయొద్దని, మీరు వేసే ఓటు ఐదేండ్ల భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని సీఎం కేసీఆర్ అన్నారు. ధరణి తీసి బంగాళాఖాతంలో వేస్తమని కాంగ్రెస్ అంటుందని, ధరణిని వేస్తారా? రైతులను వేస్తారా? అసలు మీ పాలసీ ఏంది? అంటూ ఎన్నిసార్లు అడిగినా కాంగ్రెస్ నుంచి సమాధానం రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి వరదల ముంపు నివారణకు కరకట్టను కట్టితీరుతామని హామీ ఇచ్చారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, పినపాక, వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. వ్యవసాయం గురించి రాహుల్ గాంధీకి ఏం తెలుసని, గోల్‌మాల్ మాటలతో కాంగ్రెస్ నాయకులు.. మిమ్మల్ని బురిడీ కొట్టించాలని చూస్తున్నారని, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. రాహుల్ గాంధీ, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి.. ధరణిని తీసి బంగాళా ఖాతంలో వేస్తామని బహటంగానే ప్రకటిస్తున్నారని, ధరణిని రద్దు చేస్తే దళారుల, పైరవీదారుల, లంచాల రాజ్యం వస్తుందని, ప్రజలందరూ ఏది కావాలో తేల్చుకోవాలని సూచించారు. రైతుల కష్టాలు తెలిసిన తాను రాష్ట్రంలో 24 గంటల



పాటు కరెంటు ఇస్తుంటే.. కాంగ్రెస్ వాళ్ళు ఐదు గంటలు చాలు.. మూడు గంటలు చాలు.. అంటూ మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శమన్నారు. అవగాహన లేని కాంగ్రెస్ వల్ల ఈ రాష్ట్రానికి మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుందని, కాంగ్రెస్ అధికారం కోసం తహతహలాడుతుందని, కాంగ్రెస్ వస్తే ప్రజా క్షేమాన్ని విస్మరిస్తారని ఆరోపించారు. గోదావరి వరదల వల్ల మన్య ప్రాంతం అతలాకుతలమవుతుందని., దీనిపై కరకట్ట నిర్మాణానికి రూ.2500 కోట్లతో ప్రతిపాదన తయారు చేశామని, అధ్యయనం జరుగుతుందని, మళ్లీ ఎన్నికల్లో గెలిచి కరకట్ట నిర్మాణాన్ని చేపడతామని, తానే స్వయంగా శంకుస్థాపన చేస్తానని ప్రకటించారు. పినపాక నియోజవర్గంలో రేగా కాంతారావును, భద్రాచలంలో తెల్లం వెంకటరావు, అశ్వారావుపేటలో మెచ్చా వెంకటేశ్వరరావును గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపెడతానని తెలిపారు. సభల్లో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కొత్తగూడెం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, పినపాక నియోజకవర్గం అసెంబ్లీ ఇన్‌చార్జి కోనేరు సత్యనారాయణ, దిండిగల రాజేందర్, జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

**ఆరునూరైనా గెలుపు తధ్యం**

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో నిర్వహించిన సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రజలు మా వైపే ఉన్నారని, ఆరునూరైనా గెలుపు తధ్యమని.. కిందటి సారి కన్నా ఎక్కువ సీట్లలో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దామని, ఏటా 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించగలిగామని తెలిపారు. తలసరి ఆదాయ సాధనలో నెంబర్ వన్‌గా నిలబెట్టామన్నారు. గులాబీ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసం.. తద్వారా ప్రజల ఆకాంక్షలు నేరవేర్చడం కోసమని, ఈ పదేండ్లలో కృష్ణ, గోదావరి నదులపై ప్రాజెక్టులు నిర్మించుకున్నామని తెలిపారు. ఇంటింటా తాగు నీటిని సరఫరా చేస్తున్నామని, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులతో ప్రతి ఎకరానికి సాగు నీరు అందించామన్నారు.

# పటాన్ చెరువు లో నీలం మధు పోటీతో ప్రధాన పార్టీల ఆగమాగం !

**పటాన్ చెరు- ప్రభాత సూర్యుడు:** ఎన్నికలు ఇంకా 18 రోజులు మాత్రమే ఉన్నాయని ఈ 18 రోజులు నియోజకవర్గ ప్రజలు నాతో ఉంటే 5 సంవత్సరాలు మీతో కలిసి ఉండి మీ సమస్యల పరిష్కారానికి గుడ్ మార్నింగ్ పటాన్ చెరువు పేరుతో ప్రతిరోజు మిమ్మల్ని కలుస్తూ ప్రజల సమస్యలు తీరుస్తూ ఉంటానని నీలం మధు అన్నారు. అణగారిన బిసి, ఎస్సి, ఎస్టి ,మైనారిటీలు, అగ్రవర్ణ కులాల పేదలు అందరూ ఒక త్రాటిపైకి రావలసిన అవసరము ఏర్పడిందని అన్నారు, కాంగ్రెస్, బి.ఆర్.ఎస్, పార్టీలు తనకు ద్రోహం చేశాయని అన్నారు, నమ్మించి గొంతు కోశారని అన్నారు, ఎటువంటి పరిస్థితుల్లో ఆయా పార్టీలను ఓడించి రాష్ట్రంలోని చరిత్ర సృష్టిస్తానని అన్నారు, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఎస్పీ పార్టీలో చేరుతున్నారని అన్నారు. త్వరలో బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన ఆర్ఎస్ ప్రవీణ్



కుమార్ తో పెద్ద బహిరంగ సభ ఉన్నట్లు తెలిపారు. పటాన్ చెరువు నియోజకవర్గ ప్రజలు నన్ను ఆదరించి ఏనుగు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రజల చూపు అంతా పటాన్ చెరువు వైపే ఉందని అన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలైన బి ఆర్ ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు దిక్కుతోచని స్థితిలోకి నెట్ట నెట్టబడ్డాయని అన్నారు. సోమవారం పతాన్ చెరువు నియోజకవర్గంలోని అమీన్పూర్ మండల్, జిన్నారం మండల్ ఇస్నాపూర్, చిట్కుల్, రామేశ్వరం బండ, ఐనోల్, జానకంపేట్ గ్రామాలలోని యువకులు భారీగా కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీలకు రాజీనామా చేసి బి.ఎస్.పి పార్టీలో చేరుతున్న సందర్భంగా ప్రభాత సూర్యుడుతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలవగానే గుడ్ మార్నింగ్ పటాన్ చెరువు అంటూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు, అన్ని గ్రామాలకు, బస్తీలకు కాలనీలకు, బయలుదేరి స్థానికంగా ఉన్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే వారి వారి సమస్యలు అధికారుల సమక్షంలో పరిష్కరిస్తానని అన్నారు. మెట్రో రైలు మియాపూర్ నుంచి రుద్రారం త్రిబుల్ ఐటీ వరకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పొడిగిస్తానని అన్నారు. పరిశ్రమలలో స్థానిక యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని నీలం మధు అన్నారు.

## సంపాదకీయం

# మళ్లీ తెరపైకి ద్రవిడ వాదన

బ్రాహ్మణుల గుత్తాధిపత్యంపై పోరాటం చేసిన గడ్డ తమిళనాడు. దళితుల పక్షన నిలబడి 'ఆత్మగౌరవ' ఉద్యమాన్ని ప్రారంభించిన తమిళులు ఈనాటికి సనాతన ధర్మసిద్ధాంతాలపై తమ గళం వినిపిస్తూనే ఉన్నాయి. కుల నిర్మూలన జరగాలని.. సనాతన అంటే సంస్కృతంలో 'శాశ్వతం' అని అర్థం అని.. ఈ వివిక్ష, అంటరానితనం సనాతన ధర్మం మూలసూత్రాలంటూ బ్రాహ్మణవాదంపై ఇప్పటికీ విమర్శలు గుప్పిస్తునే ఉన్నారు. ద్రవిడ ఉద్యమాల నుంచి జీవం పోసుకొని పుట్టిన ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) పెరియార్ అడుగులను ఈనాటికి అనుసరిస్తూనే ఉంది. అందుకు తాజాగా డీఎంకే మంత్రి, తమిళనాడు సీఎం కుమారుడు ఉదయనిధి చేసిన వ్యాఖ్యలే బెస్ట్ ఎగ్జాంపుల్. సనాతన ధర్మంతో సామాజిక న్యాయం జరగదని, ఇది మలేరియా, డెంగీ లాంటిదని ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనం రేపాయి.

అటు రాజకీయ రచ్చతో పాటు హిందూ మతాల పెద్దలు సైతం ఉదయనిధిపై మండిపడుతున్నారు. అసలు ఉదయనిధి ఇలా ఎందుకు వ్యాఖ్యానించారు. ద్రావిడ సిద్ధాంతాల రూపకర్త పెరియార్ రామస్వామి నాయకర్.. ప్రతి ఎన్నికల్లో ఆయన ప్రస్తావన లేకుండా ఎన్నికలు జరగవు. తమిళనాడులో దశాబ్దాలుగా ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన ద్రవిడ మున్నేట్ర కలగం(డీఎంకే), అన్నా ద్రవిడ మున్నేట్ర కలగం(ఎడిఎంకే) ఈ రెండు పార్టీల మూలాలు పెరియార్ సిద్ధాంతాల వారసత్వంగా చెప్పుకుంటాయి. అలాగే ద్రవిడ వాదం మెండుగా ఉన్న తమిళనాడు లో దాదాపు అన్ని ప్రాంతీయ రాజకీయ పార్టీల పేర్లలో ద్రవిడ అన్న పదం లేకుండా ఉండదు. 1879 లో తమిళనాడు లోని ఈరోడ్ లో జన్మించిన పెరియార్ రామస్వామి 1919లో కాంగ్రెస్ కూటమి లో చేరి మహాత్మా గాంధీతో కలిసి సత్యాగ్రహం లో పాల్గొన్నారు. ఆతర్వాత అక్కడ బ్రాహ్మణ ఆధిపత్యం నచ్చక 1925లో బయటకు వచ్చి ద్రవిడ కలగం స్థాపించారు. ఆతర్వాత అదే ద్రవిడ మున్నేట్ర కలగం.. ప్రస్తుతం తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే గా రూపాంతరం చెందింది. దేవుడ్ని పూజించడం అనారికం.. దేవుడే లేనప్పుడు పూజలు ఎవరికి అంటూ ప్రచారం మొదలు పెట్టారు పెరియార్. కొద్దిమంది మైనారిటీ సమూహం ఎక్కువగా ఉన్న మెజారిటీ అణగారిన వర్గంపై పెత్తనం. చేస్తోందంటూ పోరాటం చేశారు పెరియార్. వివక్షకు గురవుతున్న వర్గాల్లో పెరియార్ దేవుడిగా నిలిచారు. దీంతో ఆయన మాటలే అప్పట్లో సామాన్యులకు కీలకంగా నిలిచాయి. ఇప్పటికే పెరియార్ స్మరణ చేస్తున్న రాజకీయ పార్టీలు , ప్రభుత్వాలు వాడ వాడలా ఆయన విగ్రహాలను ప్రతిష్టించాయి.

ఇప్పుడు ఆ విగ్రహాల కేంద్రంగానే వివాదం రాజుకుంటోంది. తమిళనాడు బిజెపి అధ్యక్షుడు అన్నామలై నిత్యం ద్రవిడ వాదాన్ని వ్యతిరేకిస్తూ సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా పెరియార్ విగ్రహాల అంశంపై అన్నామలై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో అగ్గిని రాజేస్తున్నాయి. ఆలయాల ఎదురుగా పెరియార్ విగ్రహాలు ఉండడం.. ఆ విగ్రహాల వద్దనున్న శిలాఫలకంపై దేవుడ్ని పూజించడం మూర్ఖత్వం.. దేవుడే లేడు, లేని దేవుడి గురించి చెప్పడం అంతకన్నా మూర్ఖత్వం అన్న సందేశం ఉండడం పై తీవ్రంగా తప్పుపట్టిన అన్నామలై బిజెపి అధికారంలోకి రాగానే అలయాల ముందున్న పెరియార్ విగ్రహాలు తొలగిస్తాం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ.. ఆలయాల ముందు ఇలాంటి స్లోగన్స్ ఏంటి, అదే ముస్లిం, క్రైస్తవ మందిరాల ముందు ఇలా రాసే దమ్ముందా వీళ్లకు అంటూ ప్రశ్నించారు. అలాగే బిజెపి అధికారంలోకి రాగానే తమిళనాడులో దేవాదాయశాఖను రద్దు చేస్తామన్నారు. ఆలయాల నిర్వహణను స్థానిక మతాలకు, కమిటీలకు అప్పజెపుతామన్నారు.

అన్నామలై వ్యాఖ్యలతో తమిళనాట రాజకీయ రచ్చ మొదలైంది. ప్రజల్లో ద్రవిడ వాదం ఎంత ఉంది అన్నది అలా ఉంచితే ఆ వాదంతో రాజకీయం చేసే పార్టీలకు మంచి అవకాశం దక్కినట్లయింది. బిజెపిపై మండిపడుతూ ద్రవిడ పార్టీలన్నీ ఆందోళనలు చేపడుతున్నాయి. నిజానికి హిందీ భాషను అందరికంటే ఎక్కువగా వ్యతిరేకించేది తమిళులే. ఇటు సనాతన ధర్మంలోని కులాల నిర్మూలపై పోరాటం చేసింది కూడా అక్కడివారి. నాటి ఉద్యమంలో తెలుగు, కన్నడ ప్రజల పాత్ర కూడా ఉన్నప్పటికీ ఆ తర్వాత మాత్రం అంతగా ఈ పోరాట ప్రభావాలు కనపడవు. తమిళనాడులో మాత్రం ఈనాటికి బ్రాహ్మణవాదంపై డీఎంకే నేతలు, ఇతర హేతువాదులు విమర్శలు చేస్తూనే ఉంటారు. ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలే దీనికి ఉదాహరణ.

# సూపర్ మ్యాక్స్ కంపేనీని తెరిపిస్తాం

కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికలలో తన గెలుపు కోసం బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ నమ్మి మోస పోవద్దు,గొస పడద్దు అని పిలుపు నిచ్చారు,, గత రెండు ఎళ్ళుగా మూత పడిన సూపర్ మ్యాక్స్ కంపెనీ మూత పడి కార్మికులు నిరాహారదీక్షలు ,, నిరసనలు వ్యక్తం చేస్తున్న సమయంలో తాను కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కారించి కంపెనీ ని తిరిగి ప్రారంభిస్తానని హామి ఇచ్చినట్లు గుర్తు చేస్తూ ,, వారు ఏ విదంగా ఆందోళన చేస్తున్న నిమ్మకు నీరెత్తి వున్నల బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు ,,,ఎన్నికల సమయం దగ్గర పడటంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వారిని కేటీఆర్ వద్దకు తీసుకుని పోయు ఎన్నికల అనంతరం కంపెనీ తిరిగి ప్రారంభిస్తామని అబద్దపు హామీ ఇప్పించారని ఆరోపంచారు. గతంలో ఉషా ఫ్యాన్ కంపెనీ మరియు టెక్మా కంపెనీ లు ఇలా మూత పడి ఆ స్థలాన్ని టి.ఆర్.యస్ వారే కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని,,,వారి మాయ మాటలు సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో బి.జె.పి ప్రభుత్వం ఏర్పడుతుంది అని ధీమా వ్యక్తం చేస్తూ,,, తనను అత్యంత మెజారిటీ గెలిపించాలని ఓటర్లు ను విజ్ఞప్తి చేశారు.

# కొండా సురేఖ కోసం.. మురళీ అపసోపాలు

వరంగల్ -ప్రభాత సూర్యుడు :

కొండా సురేఖ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తోన్నారు. వరంగల్ తూర్పునియోజకవర్గం నుంచి ఆమె పోటీ చేస్తుండగా.. నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆమె గెలుపు కోసం భర్త కొండా మురళీ కూడా ఎత్తులు వేస్తున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంపై మాజీ ఎమ్మెల్సీ మురళి ఫోకస్ పెట్టారు. భార్యను గెలిపించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు బలహీనపర్చేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తోన్నారు. అందులో భాగంగా బీఆర్ఎస్‌లోని నేతలందరికీ తనవైపుకు తిప్పుకునేందుకు వారితో చర్చలు జరుపుతున్నారు. కాంగ్రెస్ లో చేరి కొండా సురేఖ గెలుపుకు సహరించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కీలక నేతగా ఉన్న డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ దంపతులతో పాటు బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఇప్పటికే కాంగ్రెస్‌వైపు తీసుకొచ్చారు. అలాగే మరో 11 మంది కార్పొరేటర్లు కొండా మురళీ సూచనతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీలోని నేతలందరినీ తమవైపు తిప్పుకోవడం ద్వారా బీఆర్ఎస్ ఆత్మస్థైర్యం దెబ్బతీయవచ్చని మురళీ భావిస్తున్నారు. ఎన్నికల వేళ ఏ పార్టీకైనా నేతలు కీలకమని చెప్పవచ్చు. ఎన్నికల సమయంలో కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, పార్టీకి ఓట్లు వేయించేలా చేయడం, పోల్ మేనేజ్‌మెంట్ నిర్వహించేందుకు నేతలు అవసరం. కానీ పోలింగ్‌కు మరో 20 రోజులు మాత్రమే సమయం



ఉన్న నేపథ్యంలో నేతలు ఒక్కొక్కరిగా వెళ్లిపోతు ండటంతో బీఆర్ఎస్‌కు ఏమీ అర్థం కావడం లేదు. పార్టీ నేతలను ఎలా కాపాడుకోవాలో తెలియక సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తన మార్క్ రాజకీయంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు కొండా మురళీ వరుస షాక్‌లు ఇస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి మరోసారి బీఆర్ఎస్ నుంచి నరేందర్ పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్ నుంచి కొండా సురేఖ, బీజేపీ నుంచి ఎర్రబెల్లి ప్రదీప్ రావు పోటీ చేస్తోన్నారు. ముగ్గురు నేతలకు స్థానికంగా పట్టు ఉంది. దీంతో ఈ సారి నియోజకవర్గంలో త్రిముఖ పోరు జరగనుందని విశ్లేషకులు చెబుతు?న్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌కు బీఆర్ఎస్ పెద్దల నుంచి అండదండలు ఉండగా.. కొండా సురేఖకు మాజీ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. సురేఖ ఎప్పటినుంచో రాజకీయాల్లో ఉన్నారు. అలాగే ఎర్రబెల్లి ప్రదీప్ రావుకు కూడా నియోజకవర్గంలో ప్రజలతో సంబంధాలు ఉన్నాయి. ప్రదీప్ రావు 15 ఏళ్ల పాటు వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా పనిచేశారు. దీంతో వ్యాపారులు, ప్రజలతో సన్నిహితం సంబంధాలు ఏర్పడ్డాయి. 2018లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రజారాజ్యం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఇప్పుడు మరోసారి పోటీ చేస్తుండటంతో సానుభూతి కలిసొచ్చే అవకాశముంది. ముగ్గురికి ప్రజల్లో బలం ఉండటంతో.. ఈ సారి టఫ్ ఫైట్ నడవనుంది. కానీ బీజేపీకి నియోజకవర్గంలో పట్టు లేకపోవడం ప్రదీప్ రావుకు మైనస్‌గా మారింది. ఇక కొండా సురేఖ గత కొన్నేళ్లుగా ఈ నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. పాదయాత్ర ద్వారా గడపగడపకు తిరిగారు.

# లిక్కర్ మరకలతో ఆప్ - తెలంగాణలో పోటీకి దూరం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :

ఆమ్ ఆద్మీ పార్టీ.. అవినీతి రహిత సాలనే లక్ష్యంగా ప్రారంభించిన పార్టీ. స్థాపించిన తొలి ఏడాదే ఢిల్లీ పీఠం దక్కించుకున్న పార్టీ.. ఈ క్రమంలో అనతికాలంలోనే పార్టీ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ ప్రజల్లో మంచి గుర్తింపు పొందాడు. దీంతో వరుసగా రెండుసార్లు పార్టీని ఢిల్లీలో అధికారంలోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో పార్టీని విస్తరిస్తూ వస్తున్నారు. ఉత్తర భారత దేశంలోని హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని వివిధ ఎన్నికల్లో పోటీ చేసింది. గోవాలో గత ఎన్నికల్లో మంచి సీట్లు గెలుచుకుంది. దీంతో ఇటీవలే ఎన్నికల సంఘం ఆప్‌ను జాతీయ పార్టీగా గుర్తించింది. అయితే జాతీయ గుర్తింపు రాకమేందే ఏడాది క్రితం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు పార్టీ అధినేత ప్రకటించారు. ఈమేరకు పార్టీ బలోపేతం, కమిటీ, కార్యవర్గం ఏర్పాటు చేశారు. కానీ ఏడాదిలో అనూహ్య పరిణామాలు మచ్చలేని ఆప్ పార్టీ ప్రతిష్టను ఘోరంగా దిగజార్చాయి. ఢిల్లీ మద్యం పాలసీలో చేసిన మార్పులు, అందులో జరిగిన అవినీతిపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు ఆదేశించడంతో సీబీఐ, ఈడీ రంగంలోకి దిగడం, భారీ కుంభకోణం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడం ఆప్ పార్టీకి పెద్ద మచ్చగా మారింది. ఇప్పటికే ఆప్‌కు చెందిన ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, మంత్రి అరెస్ట్ అయ్యారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా మూడు రోజుల క్రితం ఈ కేసు విషయమై ఈడీ నోటిసులు ఇచ్చింది. అవినీతి, ఇతర రాజకీయ పార్టీలతో పొత్తుకు దూరంగా ఉండే ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్.. లిక్కర్ పాలసీలో తప్పటడుగు వేశారు. కాదు కాదు.. ఆయనతో తప్పటడుగు వేయించారు. ఇందులో సౌత్ గ్రూప్ కీలకంగా వ్యవహరించింది.

ఈ సౌత్ గ్రూపుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నాయకత్వం వహించారు. పాలసీ మార్పులో కీలకంగా వ్యవహించారు. ఇందులో ఏపీకి చెందిన ఎంపీ, ఆయన కొడుకు, విజయసాయిరెడ్డి అల్లుడి సోదరుడు తదితరులు ఉన్నారు. వీరంతా ఈడీ విచారణ ఎదుర్కొన్నారు. అరెస్ట్ కూడా అయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో పాత్ర ఉన్నట్లు ఈడీ గుర్తించినవారిలో 90 శాతం మంది మందిని ఈడీ అరెస్ట్ చేసింది. సౌత్ నుంచి ఎంపీ కొడుకు మాగుంట రాఘవ కూడా జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. కానీ, తెలంగాణ నుంచి కవిత కూడా మూడుసార్లు ఈడీ విచారణకు హాజరయ్యారు. ఈడీ ధ్వంసం చేసినట్లు పేర్కొన్న తన ఫోన్లను కూడా అప్పగించారు. తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. దీంతో కాస్త రిలాక్స్‌గా ఉన్నారు. అయితే సుప్రీంకోర్టు విచారణపై మాత్రమే స్టే ఇచ్చింది. అరెస్ట్ ఆపమనలేదు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం పుణ్యాన పొత్తుల రాజకీయాలకు దూరంగా ఉండే అరవింద్ కేజ్రీవాల్ ఒక్క తప్పటడుగు వేసి దొరికిపోయారు. దీంతో రక్షణ కోసం విపక్ష కూటమిలో చేరక తప్పలేదు. అంతకు ముందు అనేక ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్న కేజ్రీవాల్, లిక్కర్ స్కాం నుంచి తప్పించుకునే పరిస్థితి లేకపోవడంతో విపక్షాల పంచన చేరారు. ఈ క్రమంలో కుంభకోణానికి తెరతీసిన కల్వకుంట్ల కవిత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కావడంతో కేసీఆర్‌తోనూ చేతులు కలిపారు. గతంతో తెలంగాణలో పోటీకి సై అన్న ఆప్.. లిక్కర్ స్కాం కారణంగా ఇప్పుడు సౌత్‌లో పోటీకి ఆసక్తి చూపడం లేదు. తాను పోటీ చేయడం వలన బీఆర్ఎస్ ఓట్లు చీలిపోయే అవకాశం ఉంది. దీంతో కేసీఆర్ సూచన మేరకే ఆయన తెలంగాణ ఎన్నికల బరిలో నిలవలేదని తెలుస్తోంది. అదే సమయంలో ఇండయా కూటమిలో ఉన్న కేజ్రీవాల్ మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తెలంగాణలోని బీఆర్ఎస్ ఇండియా కూటమిలో లేకపోయినా పోటీకి దూరంగా ఉండడం కేసీఆర్, కవిత కోసమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# బిగాల హ్యాట్రిక్ కొట్టేనా

నిజామాబాద్ - ప్రభాత సూర్యుడు : నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ కొట్టేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఓ వైపు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తునే మరోవైపు జోరుగా చేరికలు చేయిస్తున్నారు. ఎమ్మెల్యేకు తోడుగా కార్పొరేటర్లు సైతం గల్లీ గల్లీ చుట్టేస్తున్నారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులతో ఓ బుక్‌లెట్‌ను రూపొందించారు. ఈ బుక్‌లెట్ ఇంటింటికీ అందజేస్తూ ప్రచారం నిర్వ హిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్‌లో బిగాల హైట్రిక్ ఖాయమని ఆయన మద్దతుదారులు ధీమాగా ఉన్నారు నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజ కవర్గంలో మొత్తం 2,86,766 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,39,163, మహిళలు 1,47,571 మంది ఉన్నారు. 2014 అలాగే 2019 ఎన్నికల్లో గణేష్ గుప్త ప్రత్యర్థులపై వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. ప్రతి ఎన్నికల్లో బిగాల గణేష్ గుప్తా ఓట్ల శాతాన్ని పెంచుకుంటున్నారు. ఈసారి భారీ మెజార్టీ వస్తుందని భావిస్తున్నారు. 2014 ఎన్నికల్లో బిగాలకు కేవలం 42,148 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కేవలం 10 వేల ఓట్ల మెజార్టీతో మాత్రమే గెలుపొందారు. 31.15 శాతం ఓట్లు వచ్చాయి. కానీ 2019 ఎన్నికల్లో ఏకంగా 25 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 71,896 ఓట్లు వచ్చాయి. ఓట్ల శాతం కూడా భారీగా పెరిగింది. మొత్తంగా 47.8 శాతం ఓట్లు బిగాల సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో మెజార్టీ 50 వేల వరకు పెరిగే అవకాశముందని ఆయన మద్దతుదారులు అంటున్నారు. గడిచిన తొమ్మిది ఏండ్లలో నగరంలో భారీగా అభివృద్ధి పనులు చేపట్టామని, ఐటీ టవర్, ఇంటిగ్రేటడ్ మార్కెట్లు, స్మశానవాటికలు, కొత్త కలెక్టరేట్, కళాభారతి భవన ప్రతిపాదనలు ఇవన్నీ కలిసి వస్తాయని భావిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్‌లో మైనార్టీ ఓట్లు కీలకంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నుంచి ఎంఐఎం పోటీకి దూరంగా ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి మైనార్టీకి చెందిన షబ్బీర్ అలీని ప్రకటించినప్పటికీ.. ఆయన కామారెడ్డి వాసి. అర్బన్‌లో నాన్‌లోకల్ కానున్నారు. ఇక బీజేపీ నుంచి ధన్‌పాల్‌కు మైనార్టీ ఓట్లు పోలవవు కాబట్టి ఈ ఓట్లు కలిసి వస్తే విజయం నల్లేరుపై నడకగా మారనుందని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. నిజామాబాద్ పట్టణంలో బిగాల గణేష్ గుప్తా వరుస ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మైనార్టీ, పద్మశాలి, గౌడ, కురుమ, మున్నూరుకాపు, ముదిరాజ్ ఇలా అన్ని సామాజిక తరగతులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. గత తొమ్మిది సంవత్సరాల్లో ఈ సామాజిక తరగతుల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలతో పాటు నగరంలో ఆయా కుల సంఘాలకు ఇచ్చిన నిధుల గురించి వివరిస్తున్నారు. అలాగే మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తారన్నది కూడా వివరిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కేసీఆర్ బీమా, సౌభాగ్య లక్ష్మి పథకం కింద నీరు పేద మహిళలకు 3000 జీవన భృతి, ఆసరా పింఛన్ల పెంపు, రూ.400 లకే వంట గ్యాస్, ఆరోగ్య శ్రీ ద్వారా 15 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందజేస్తామని చెబుతున్నారు.

## ఇజ్రాయేల్ ఆర్మీని
# ఉగ్రవాద సంస్థగా పరిగణించాలి

### ముస్లిం దేశాలకు ఇరాన్ పిలుపు

ఇరాన్ -ప్రభాత సూర్యుడు :

ఇజ్రాయేల్ ? హమాస్ పరస్పర దాడులతో పాలస్తీనా చిన్నాభిన్నమవుతోంది. గాజాతో పాటు పలు నగరాల్లో లక్షలాది మంది నిరాశ్రయులువుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ఇజ్రాయేల్ సైన్యంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. సౌదీ అరేబియా రాజధాని రియాద్ లో జరిగిన అరబ్, ముస్లిం దేశాల నాయకుల సమావేశం వేదికగా.. పాలస్తీనాలో విధ్వంసం సృష్టిస్తున్న ఇజ్రాయేల్ ఆర్మీని ఉగ్రవాద సంస్థగా పరిగణించాలని ఆయన ముస్లిం దేశాలను కోరాడు. 'గాజాలో ఆక్రమణలకు, నరమేధానికి పాల్పడుతున్న ఇజ్రాయేల్ సైన్యాన్ని ఇస్లాం దేశాలు ఉగ్రవాద సంస్థగా గుర్తించాలి. అంతేకాదు యూదులకు రాజకీయ, ఆర్థిక సంబంధాలకు ముగింపు పలకాలి. వాళ్లతో వ్యాపార కార్యకలాపాలను రద్దు చేసుకోవాలి' అని ఇబ్రహీం పిలుపునిచ్చారు. ఇజ్రాయేల్‌కు సైనిక, ఆర్థిక సహాయం అందిస్తున్న అమెరికాను ఆయన తప్పుపట్టారు. యూదులు వాడుతున్న యుద్ధ సామాగ్రి, ఇంధనం పూర్తిగా అమెరికాకు చెందినదే. గాజాలో జరుగుతున్న విధ్వంసకాండకు అమెరికానే కారణం అని ఇరాన్ అధ్యక్షుడు మండిపడ్డాడు.



# బిఆర్ఎస్ పార్టీకే మా మద్దతు

## నందివనపర్తి భవన నిర్మాణ సంఘాల నాయకులు





**యాచారం - ప్రభాత సూర్యుడు :** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజక వర్గ అభివృద్ధి ప్రధాత మంచిరెడ్డి కిషన్ రెడ్డికే మద్దతు పలికిన నందివనపర్తి భవన నిర్మాణ మరియు వివిధ కులవృత్తుల నాయకులు. నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజునాయక్, ఉపసర్పంచ్ మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి, బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అనంతరం రాజునాయక్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని వర్గాల ప్రజలు బిఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి గెలుపును కోరుకుంటున్నారని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో 4 వ సారి కిషన్ రెడ్డి గెలవడం ఖాయం అని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

# నేడే ఇబ్రహీంపట్నంలో సీఎం ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ

## - బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మంగళవారం సాయంత్రం 4గంటలకు ఇబ్రహీంపట్నం పరిధిలోని ఖానాపూర్ గేటు సమీపంలో జరిగే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లు పరిశీలించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు క్యామ మల్లేష్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పరిశీలించారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని నియోజకవర్గానికి 2వేల 981 కోట్లతో అభివృద్ధి చేశామని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, ఎంపీపీ కృపేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, నర్మదా, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ లో దాడుల సంస్కృతి మంచిది కాదు


**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అచ్చంపేట ఎమ్మెల్యే అభ్యర్థి గువ్వల బాలరాజుని మంత్రి కేటీఆర్ పరామర్శించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ నిన్న అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ తన అనుచరులతో కలిసి బాలరాజు మీద దాడి చేశాడు. తెలంగాణ లో దాడుల సంస్కృతి మంచిది కాదని అన్నారు.కాంగ్రెస్ నాయకులు బాలరాజు సతీమణిని కూడా అవమాన పరిచేలా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని ఈ సంస్కృతి ని ప్రవేశపెడితే తప్పకుండా అనుభవిస్తారు. శాంతి భద్రతలపై డిజిపి కి విజ్ఞప్తి చేస్తున్నాము బాలరాజుకి సెక్యూరిటీ పెంచాలని కోరుతున్నా. వచ్చేది మా ప్రభుత్వం ఇంతకు ఇంత అనుభవిస్తారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరుతున్నా. ఒక దళిత బిడ్డ మీదనే ఇలా జరిగితే సామాన్యుల పరిస్థితి ఇంకా ఇంకా ఎలా ఉంటుందని అన్నారు.

# కౌన్సిలర్ ను అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

**నల్లగొండ - ప్రభాత సూర్యుడు :** నల్లగొండ పట్టణంలోని ఆర్జాల బావిలో ఉద్రిక్తత నెలకొంది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన కౌన్సిలర్ కు చుక్కెదురయింది. కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డికి మద్దతుగా ప్రచారానికి వచ్చిన కౌన్సిలర్ ను బీఆరెస్ శ్రేణులు అడ్డుకున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశావంటూ కౌన్సిలర్ను నిలదీసారు. నేపథ్యంలో మైనార్టీలపై కాంగ్రెస్ నాయకులు దాడికి దిగారు. దాంతో టిఆర్ఎస్ కార్యకర్తలు .. ప్రతి దాడి చేసారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి దగ్గరుండి దాడి చేయించాడంటూ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

# కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తాం : మల్ రెడ్డి రంగారెడ్డి

## - కాంగ్రెస్ పార్టీ రావాలి
## - పేదలకు ఇండ్లు ఇవ్వాలి



**తుర్కయంజాల్ - ప్రభాతసూర్యుడు :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డికి కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. పల్లె పల్లె కు మల్ రెడ్డి రంగన్న కార్యక్రమంలో మల్ రెడ్డి సమక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ కార్య కర్తలు వివిధ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలోచేరడం జరిగింది. ఇందిరమ్మ రాజ్యం రావాలి కాంగ్రెస్ పార్టీ ఇండ్లు ఇస్తుందని. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వస్తుందని. ఇండ్లు ఇవ్వబోయేది కూడా కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగు తుందని కెసిఆర్‌కు కాలంచెల్లిందని ఇబ్ర హీంపట్నం నియోజ వర్గంలో మంచి రెడ్డికి ఆదరణ కరువైతుందని ఆయన తెలిపారు. మా పైన దౌర్జ న్యంగా దాడులు చేస్తున్నారని ఎక్కడ కుండా అదరకుండా ప్రచారం చేస్తూ ముందుకు సాగుతు న్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టో ఉన్న పథకాలు ప్రజలకు అందే విధంగా ఉంటుందని. ఆయన తెలిపారు. ప్రజలకు కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ వస్తుందని దిమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్మన్, అనురాధ రామిరెడ్డి, వైస్ చైర్మన్ హరిత ధనరాజ్ గౌడ్, కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కోశికే ఐలయ్య, కౌన్సిలర్ కాకుమాను సునీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు ఓరుగంటి యాదయ్య,టిడిపి మున్సిపల్ అధ్యక్షులు రావుల వీరేశం, టిడిపి నాయకులు ఎస్ఎఫ్ఐ శివ, క్రాంతి, కాటంరాజు, పూల యాదయ్య, సంజీవ, రాజు నాయక్, మహిళా నాయకురాలు లక్ష్మీ నగర్ కాలనీవాసులు అధ్యక్షులు దేశీయ నాయక్, రాజు నాయక్, మోహన్ నాయక్, ఎస్టీ సెల్ చైర్మన్ మంగ్య నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగ్యా నాయక్, శంకర్ నాయక్, దశ్రు నాయక్, ఎం లక్ష్మణ్, ఎస్ లక్ష్మణ్, పార్టీలో చేరిన తాటికొండ అశోక్ గౌడ్, గుర్రం శ్రీనివాస్, మహిళా నాయకురాలు మంగ్లీ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పాల్వాయి కుటుంబాన్ని కాంగ్రెస్ అవమానించింది

## మంత్రి కేటీఆర్



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** కాంగ్రెస్ నేత పాల్వాయి స్రవంతి ఆదివారం భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ పాల్వాయి స్రవంతిని ఒక సోదరుడుగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నాను. రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బిజెపిలోకి ఎందుకు పోయారో...మళ్లీ తిరిగి కాంగ్రెస్ లోకి ఎందుకు చేరిండో ఎవరికి తెలవదు. ఆయన వలన రాష్ట్రం ఉప ఎన్నికను ఎదుర్కొని పరిపాలన అస్తవ్యస్తం అయ్యేలా చేశారు. కాంగ్రెస్ పార్టీకి సంవత్సరాలపాటు పార్టీ ఎత్తుపల్లాలో అండగా నిలిచిన కుటుంబం పాల్వాయి గోవర్ధన్ రెడ్డి ది. కాంగ్రెస్ పార్టీ పట్ల తన నిబంధన చాటుకుంటూ పార్టీ మారకుండా, పార్టీకి అండగా నిలబడ్డ వ్యక్తి గోవర్ధన్ రెడ్డి. అలాంటి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ అవమానపరిచింది. మునుగోడు ఉప ఎన్నికల్లో ఎవరు పోటీ చేసేందుకు ముందుకు రాకున్నా స్రవంతి గారు పోటీ చేసి కాంగ్రెస్ కి గౌరవప్రద స్థానాన్ని కట్టబెట్టారు. గోవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని వాడుకొని కాంగ్రెస్ పార్టీ పరువు దక్కించుకుంది. నిన్నటిదాక రేవంత్ రెడ్డి రాజగోపాల్ రెడ్డి తిట్టుకున్న తీరు ప్రజలు చూశారు. డబ్బు మదంతో విర్రవీగుతున్న రాజగోపాల్ రెడ్డికి మునుగోడు లో బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నది. ఈ రోజు పార్టీలో చేరడంతో మన పని అయిపోలేదు ఇప్పుడే పని ప్రారంభమైంది. మును గోడులో గులాబీ జెండా మరోసారి ఎగరేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పుడు మళ్లీ కలిసిపోయిన తీరు ప్రజల్లో ఏవగింపును కలిగిస్తుంది. నల్లగొండ జిల్లాకు ముఖ్యంగా మునుగోడు నియోజకవర్గానికి మన ప్రభుత్వం చేసిన పనులన్నీ మీ కండ్ల ముందే ఉన్నాయి. తరతరాల ఫ్లోరైడ్ తరిమివేసి, మునుగోడు నియోజకవర్గం లోని మిషన్ భగీరథ పైలాన్ ఆవిష్కరించుకోవడం జరిగింది. కెసిఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫ్లోరోసిస్ వ్యాధి పూర్తిగా తెలంగాణ నుంచి పోయిందని కేంద్ర ప్రభుత్వంమే స్వయంగా చెబుతుంది. నల్లగొండ జిల్లాలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా గతంలో లేకుండే కానీ ఇప్పుడు మూడు మెడికల్ కాలేజీలు వచ్చాయి. భారతదేశంలోనే అత్యంత పెద్దదైన అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్ట్ నల్గొండ జిల్లాలోనే వస్తుంది. తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉంటే తెలంగాణ రాష్ట్రంలో నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఒకప్పటి యాదగిరిగుట్ట ఏ విధంగా ఉండేది ఇప్పుడు ఏ విధంగా యాదాద్రిగా మారిందో ఆలోచించాలి. ఈరోజు కాంగ్రెస్ పార్టీకి వ్యవసాయము ఉచిత విద్యుత్తు పైన ఏమాత్రం అవగాహన లేదు. కేవలం రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుంది అంటూ పిసిసి ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి అంటున్నారు. రైతుబంధు ఇవ్వడం డబ్బులు వృధా అని ఉత్తంకుమార్ రెడ్డి అంటున్నాడు. కాంగ్రెస్ కావాలా కరెంట్ కావాలా రైతులు ఆలోచించుకోవాలి. తెలంగాణకు ఉన్న ఏకైక గొంతుగా కేసీఆర్ని కట్టడి చేస్తే తమకు ఎదురులేదని రాహుల్ గాంధీ మోడీ భావిస్తున్నారు. తాము తప్ప ఇతరులు ఎదగకూడదన్న దుర్మార్గపురిత ఆలోచన వాళ్ళది. స్రవంతి తన భవిష్యత్తు గురించి కాకుండా తన కష్ట కాలంలో తన వెంట నడిచిన నాయకులు వాటి శ్రేణుల గురించి అడిగారు. వారి భవిష్యత్తు బాధ్యతను నేను తీసుకుంటానని అన్నారు.పాల్వాయి స్రవంతి మాట్లాడుతూ దీపావళి పండుగ రోజు భారత రాష్ట్ర సమితిలో చేరడం సంతోషంగా ఉంది. కాంగ్రెస్ పార్టీని విడాలన్న నిర్ణయం బాగా ఆలోచించి తీసుకోవడం జరిగింది. ఎక్కడైతే గౌరవం లేదు అక్కడ ఒక్క నిమిషం ఉండకూడదని మా తండ్రి చెప్పిన మాటలు మేరకు కాంగ్రెస్ని వీడాను. ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ మాకు తెలిసిన కాంగ్రెస్ పార్టీ కానే కాదు. ఎప్పుడో ఒకప్పుడు జీవితంలో ఒక సానుకూలమైన మార్పు అవసరం అన్న ఆలోచనతో మా పార్టీ కార్యకర్తలు నాయకుల అభిప్రాయంతో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని అన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్, భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సోదరుడు కేటీఆర్ తో నడవాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. నాతోపాటు నడిచి వచ్చిన కార్యకర్తలు నాయకుల భవిష్యత్తు బాధ్యతను కేటీఆర్ కి అప్పజెప్పి ఆయన మీద విశ్వాసంతో ముందుకు నడుస్తున్నామని తెలిపారు.

# డబుల్ డెక్కర్ బస్సుల్లో ఫ్రీ...ఫ్రీ



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** హైదరాబాద్ నగర వాసులకు ,ఇతర ప్రదేశాల నుంచి హైదరాబాద్ కు వచ్చే పర్యాటకులకు హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ అథారిటీ ( హెచ్ఎండిఎ) శుభవార్త అందించింది.హుసేన్ సాగర్ చుట్టూ తిరిగే ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సుల్లో సందర్శకులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా గత కొద్ది రోజులుగా హుస్సేన్ సాగర్ చుట్టూ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు పరుగులు తీస్తున్నాయి. అయితే సందర్శకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. గతేడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఫార్ములా ఈ రేసు పోటీల సమయంలో హెచ్ఎండిఎ ఈ డబుల్ డెక్కర్ బస్సులను కొనుగోలు చేసింది.ఒక్కో బస్సు కోసం రూ.2.5 కోట్లు వెచ్చించి మూడు డబుల్ డెక్కర్ బస్సులను కొనుగోలు చేసింది. కానీ చాలా కాలం వరకు ఈ బస్సులు పార్కింగ్ కే పరిమితం అయ్యాయి. కాగా ప్రస్తుతం ఈ బస్సులను హుస్సేన్ సాగర్ చుట్టూ తిప్పుతున్నారు సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం,అమరుల స్మారక ఏర్పాటు తరువాత నెక్లెస్ రోడ్డు వైపు వచ్చే సందర్శకుల రద్దీ గణనీయంగా పెరగడం,హైదరాబాద్ వాసులు మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలు,దేశాల నుంచి వచ్చే వారు కూడా ఈ పరిసర ప్రాంతాలను సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో వస్తూ ఉండడంతో ఈ బస్సులను పర్యాటకుల కోసం హుస్సేన్ సాగర్ చుట్టూ అన్నీ పర్యాటక కేంద్రాలు కవర్ అయ్యేలా తిప్పనున్నారు.ప్రస్తుతం సాగర్ చుట్టూ మూడు బస్సులు తిరుగుతున్నాయి? సంజీవయ్య పార్క్,థ్రిల్ సిటీ, లేక్ ఫ్రంట్ వ్యు,జలవీహార్ పార్క్, నిరా కేఫ్, పెప్పుల్స్ ప్లాజా,ఇందిరా గాంధీ, పీవీల విగ్రహాలు, అంబేద్కర్ విగ్రహం సహా తదితర ప్రాంతాలు సందర్శించుకున్న అనంతరం సెక్రటేరియట్‌కు వెళ్లొచ్చు. అక్కడి బస్సు దిగి నడుచుకుంటూ అమరవీరుల స్మారకాన్ని చూడొచ్చు. తరువాత బస్సులో టాంక్ బండ్ వైపు వెళ్లొచ్చు.అనంతరం ఈ డబుల్ డెక్కర్ బస్సులు టాంక్ బండ్ మీదుగా తిరిగి సంజీవయ్య పార్క్ వరకు చేరుకుంటాయి.ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు డబుల్ డెక్కర్ బస్సులు సాగర్ చుట్టూ తిరుగుతాయి.అయితే సాయంత్రం 5 గంటల నుంచే సందర్శకులు పెద్ద సంఖ్యలో రావా

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215